క్లుప్తంగా

నిబంధనలు తప్పనిసరి
ఏసీపీ సతీశ్


సతీశ్, ఏసీపీ, హుస్నాబాద్

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ డివిజన్ పరిధిలోని వినాయకుడి మండపాల దగ్గర నిబంధనలు పాటించాలని, పోలీసు స్టేషన్‌ను నుంచి అనుమతులు తీసుకోవాలని ఏసీపీ సతీశ్ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రెండు స్పీకర్ల మైక్‌సెట్‌లను మాత్రమే వినియోగించాలని, రాత్రి 10నుంచి ఉదయం 6వరకు మైక్‌లు, స్పీకర్లను వాడవద్దని చెప్పారు. అలాగే మండపాలతో రోడ్డు మొత్తం బ్లాక్ చేయవద్దని, విద్యుత్ వినియోగానికి డీడీ తీసి విద్యుత్‌శాఖ అనుమతి తీసుకోవాలని సూచించారు. ఫైర్ సేఫ్టీని ఏర్పాటు చేసుకోవాలని, విద్యుత్ షాక్ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. డీజేలకు అనుమతి లేదని ఏవరు ఏర్పాటు చేసినా సీజ్ చేస్తామని హెచ్చరించారు.

సెంట్రింగ్ బాక్స్‌ల దొంగకు రిమాండ్


వివరాలు తెలియజేస్తున్న ఎస్‌ఐ మహేశ్

హుస్నాబాద్‌రూరల్: మండల పరిధిలోని పోతారం(ఎస్) మర్రిచెట్టు దగ్గర నిర్మాణంలో ఉన్న ఇంటి వద్ద నుంచి సెంట్రింగ్ బాక్స్‌లను అపహరించిన దొంగను పట్టుకుని బుధవారం రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ మహేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం జూన్ 10న సెంట్రింగ్ బాక్స్‌లు చోరీ జరిగిందని బాధితుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయగా అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామానికి చెందిన ఉప్పు రాజు బాక్స్‌లను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. దీంతో రాజును అదుపులోకి తీసుకొని అతడి వద్ద నుంచి 50సెంట్రింగ్ బాక్స్‌లను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు పంపించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

'స్థానిక' ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటాలి



మాట్లాడుతున్న భిక్షపతి

మిరుదొడ్డి(దుబ్బాక): బీజేపీ సభ్యత్వమే లక్ష్యంగా స్థానిక సమస్యలపై పోరాడుతూనే రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ సర్పంచ్ అభ్యర్థులను గెలిపించుకోవడానికి కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ జిల్లా సభ్యత్వ కన్వీనర్ మల్లన్నగారి భిక్షపతి పిలుపునిచ్చారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఎల్ముల దేవరాజు ఆధ్వర్యంలో బుధవారం మిరుదొడ్డిలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో ఆరు వేల సభ్యత్వాలే లక్ష్యంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సురేశ్, సదానందరెడ్డి, భాను, నాయకులు స్వామి, రవి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు 2కే రన్

మిరుదొడ్డి(దుబ్బాక): జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని అక్బర్‌పేట–భూంపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో గురువారం 2కే రన్ నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం బి.రాజేందర్, పీఈటీ వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ 12 నుంచి, 30 యేళ్ల కలిగిన యువతీ, యువకులు భూంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఉదయం 9గంటలకు హాజరు కావాలన్నారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ అబ్బుల ఉమారాణి, ఎస్‌ఐ హరీశ్, బాలాగౌడ్, వంశీచంద్ హాజరుకానున్నట్లు తెలిపారు.

కాలువను ఆక్రమించారు..


చదును చేసిన వరద కాలువ

అక్కన్నపేట(హుస్నాబాద్): చౌటపల్లి చెరువులోకి వచ్చే వరద కాలువను ఆక్రమించి చదును చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు బుధవారం డిమాండ్ చేశారు. రెండు రోజుల కిందట కొందరు జేసీబీ సహాయంతో మల్లంపల్లి చెరువు నుంచి చెక్‌డ్యామ్‌కు వచ్చే ప్రధాన కాలువను పూడ్చేసి చదనుచేసి తన భూమిలో కలుపుకున్నారని పేర్కొన్నారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు.

అక్రమార్కుల చెరలో చెరువులు


పాలసముద్రం చెరువులోని ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన గోడ

- ఉదాసీనంగా అధికారులు
- కట్టడి చేయకుంటే నష్టమే
- 'హైడ్రా' లాంటి చర్యలు అవసరం

ములుగు(గజ్వేల్): జలాశయాలపై అక్రమార్కులు కన్నేస్తున్నారు. అవకాశం దొరికిన చోటల్లా గద్దల్లాగా వాలిపోతున్నారు. శిఖం భూములు, ఎఫ్‌టీఎల్ భూములను తమ ఇష్టానుసారం అన్యాక్రాంతం చేస్తున్నారు. చెరువులపై అధికారుల అజమాయిషీ లేకపోవడంతో చెలరేగిపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అందుకు మండలంలోని బండ తిమ్మాపూర్ పాలసముద్రం చెరువు ఆక్రమణ తీరు నిదర్శనంగా నిలిచింది. ఇదే విధంగా మండలంలోని అనేక చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయి. 'హైడ్రా' లాంటి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

హైదరాబాద్ సమీపంలో..

ములుగు మండలం హైదరాబాద్‌కు అత్యంత సమీపంలో ఉంటుంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు సిద్దిపేట జిల్లా ములుగు సరిహద్దులు అనుకుని ఉంటాయి. ఇక్కడి భూముల విలువ రూ.కోట్లలో ఉంది. దీంతో చెరువు శిఖం భూములపై కన్నేస్తున్నారు. ఇరిగేషన్‌శాఖ రికార్డుల ప్రకారం ములుగు మండలంలోని కొక్కొండ, కొత్తూరు, నర్సాపూర్, కొట్యాల, నాగిరెడ్డిపల్లి, తున్కిబొల్లారం గ్రామాల్లో వంద ఎకరాలకు పైగా ఆయకట్టు కలిగిన ఆరుఐబీ చెరువులు ఉన్నాయి. వందలోపు ఆయకట్టు కలిగిన 157 చెరువులు ఉన్నాయి. ఈ చెరువుల ద్వారా 3,900 ఎకరాల ఆయకట్టు నిర్దేశితమైంది. కానీ చాలా చెరువుల్లో ఎఫ్‌టీఎల్, శిఖం భూములు ఆక్రమణకు గురయ్యాయి. కొన్నిచోట్ల ఏకంగా నిర్మాణాలు చేపడుతున్నారు. చెరువులను పర్యవేక్షించాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం తోడవడంతో చెరువుల ఆక్రమణ యథేచ్ఛగా సాగుతోందని స్థానికులు వాపోతున్నారు. ఎన్నిమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా, విన్నవించుకున్నా వారు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చెరువులను కాపాడాలి..

గ్రామనీటి అవసరాలకు, పంటల సాగుకు చెరువులు ఎంతో ఉపయోగపడతాయి. పశుపక్షాదులకు, బతుకమ్మ పండుగలు, నిమజ్జనాలకు వినియోగిస్తుంటాం. చెరువు బాగుంటేనే ఊరుకు మంచిది. మా చెరువు శిఖం భూమిలో ఓ ప్రైవేట్ పరిశ్రమకు చెందిన వారు గోడ నిర్మించారు. చెరువు భూములల్లో ఎలాంటి నిర్మాణాలు జరగకుండా కలెక్టర్ చర్యలు తీసుకోవాలి.

– శ్రీకాంత్, బండ తిమ్మాపూర్

ఆక్రమిస్తే చర్యలు తప్పవు

బండతిమ్మాపూర్ పాలసముద్రం చెరువులో అక్రమంగా ప్రహరీ నిర్మాణం చేపట్టింది వాస్తవమే. అక్రమ నిర్మాణాలపై ములుగు తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెరువులను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటాం.

– సురేశ్‌బాబు, ఇరిగేషన్ డీఈ

అక్రమ నిర్మాణాలను కూల్చేస్తాం..

బండమైలారం పాలసముద్రం చెరువులో అక్రమ నిర్మాణాలకు సంబంధించి ఇరిగేషన్ అధికారుల నుంచి ఫిర్యాదు అందింది. ఆక్రమణపై చెరువులో సర్వే జరిపిస్తున్నాం. సర్వే నివేదిక ఆధారంగా ఆ నిర్మాణాన్ని కూల్చేస్తాం. చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– ప్రవీణ్‌రెడ్డి తహసీల్దార్ ములుగు

రైతులు ఆందోళన చెందొద్దు

- వ్యవసాయశాఖ అధికారులు
- రుణమాఫీపై ఇంటింటి సర్వే


జగదేవ్‌పూర్(గజ్వేల్): సర్వే చేస్తున్న ఏఓ వసంతరావు

జగదేవ్‌పూర్(గజ్వేల్)/చిన్నకోడూరు(సిద్దిపేట)/మద్దూరు(హుస్నాబాద్)/దుబ్బాకటౌన్/బెజ్జంకి(సిద్దిపేట)/తొగుట(దుబ్బాక): రెండు లక్షల రుణమాఫీ కానీ రైతులు ఆందోళన చెందవద్దని, రేషన్‌కార్డు లేని రైతులకు కూడా కుటుంబ నిర్ధారణచేసి అర్హులైన రైతులను గుర్తిస్తామని ఏఓ వసంతరావు చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జగదేవ్‌పూర్‌లో బుధవారం ఇంటింటా సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ కాని రైతుల కోసం ప్రభుత్వం కొత్తగా భరోసా యాప్ తీసుకువచ్చారన్నారు. భార్యాభర్తలే కాకుండా 18యేళ్లు దాటిన కుటుంబ సభ్యుల ఫొటోలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓలు పాల్గొన్నారు. అదేవిధంగా చిన్నకోడూరు మండలంలోని అన్ని గ్రామాల్లో వ్యవసాయ అధికారులు రైతుల ఇంటివద్దకు వెళ్లి సర్వే నిర్వహించి, వారి పేర్లను యాప్‌లో నమోదు చేశారు. రూ. 2లక్షలకు పైగా రుణాలు ఉన్న రైతులకు రుణమాఫీ ఎలా అమలు చేయబోతున్నారో వివరించారు. రుణమాఫీ కాని రైతు సమస్యలపై వివరించారు. రైతుల పేర్లు యాప్‌లో నమోదు చేసి రైతులతో అధికారులు సెల్ఫీ తీసుకున్నారు. మద్దూరు మండలంలో వ్యవసాయశాఖ అధికారులు రైతుల వివరాలకు ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణ మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో రుణమాఫీ కాని 408 మందిని గుర్తించామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రాకేశ్ తదితరులు పాల్గొన్నారు. రాయపోల్ మండలం రామారంలో రేషన్ కార్డులేక రుణమాఫీ కాని రైతుల నిర్ధారణ సర్వే చేపట్టామని మండల వ్యవసాయ అధికారి నరేశ్ చెప్పారు. మండల వ్యాప్తంగా 109మంది రైతులకు రేషన్ కార్డులు లేక రుణమాఫీ అందలేదన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు. తొగుట మండలంలోని కాన్గల్ గ్రామంలో రుణమాఫీ కుటుంబ నిర్ధారణ సర్వేను ఏఓ మోహన్ నిర్వహించారు. మండలంలోని ఎస్‌బీఐ, ఏపీజీవీబీ బ్యాంకుల పరిధిలోని 205 మంది రైతుల కుటుంబ నిర్ధారణ చేయాల్సి ఉందని చెప్పారు.

చికిత్స పొందుతూ మృతి

దుబ్బాక: ఐదు రోజుల క్రితం బోడోనికుంటలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిన వ్యక్తి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడని ఎస్‌ఐ గంగరాజు తెలిపారు. దుబ్బాకలోని డబుల్ బెడ్రూం కాలనీకి చెందిన రియాజ్ తన స్నేహితుడు శివతో కలిసి బోడోనికుంటలో 24న కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు రియాజ్ నీటిలో పడి మునిగిపోయాడు. దీంతో అతడి స్నేహితుడు, స్థానికులతో కలిసి రియాజ్‌ను బయటకు తీసి ఆసుపత్రికి తరలించాడు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. రియాజ్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు

అవార్డు గ్రహీతకు సన్మానం


సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కొండపాక(గజ్వేల్): ఇటీవల బంగారు నంది అవార్డు అందుకున్న కుకునూరుపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కూరెళ్ళ శ్రీనివాస్‌రెడ్డిని ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. విద్యాపరంగా ఆయన అందించిన సేవలకు నంది అవార్డు అందుకున్నారు. పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా కొండపాక బాలుర హైస్కూల్‌కు వెళ్లిన ఆయనను ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సముద్రాల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, పీఆర్టీయూ నేతలు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమాన

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు కోర్టు జరిమాన విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీలలో 11మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో బుధవారం హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.14,500 జరిమాన విధించినట్లు సీఐ తెలిపారు.

రక్షణ చట్టాలపై అవగాహన అవసరం

మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ దుర్గ


అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ దుర్గ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మహిళలు, చిన్నారులు తమకు ఉన్న రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ పిలుపునిచ్చారు. రక్షణ చట్టాలు, షీటీమ్ పనితీరు, డ్రగ్స్, సైబర్ నేరాలపై బుధవారం ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆమె అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మాయిలను ఎవరైనా అవహేళన చేసినా, ఏ విధమైన ఇబ్బందులకు గురిచేసినా వెంటనే పాఠశాల ఆవరణలో ఉన్న బాక్స్‌లో షీ టీమ్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ఆ ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు సూచించారు. అపరిచితుల ఫోన్‌కాల్స్, మాయ మాటలు నమ్మవద్దని చెప్పారు. సోషల్ మీడియా, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. వేధింపులకు గురైన మహిళలు, బాలికలు వెంటనే డయల్ 100, షీటీమ్ నంబర్ 87126 67434కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, షీ టీమ్ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు అందజేత

సిద్దిపేటకమాన్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను నూతన టెక్నాలజీ సాయంతో పోలీసులు గుర్తించి బాధితుడికి అందజేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన అఖిల్ కొద్ది రోజుల క్రితం తన సెల్‌ఫోన్‌కు పోగొట్టుకున్నాడు. దీంతో అతడు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు సీఈఐఆర్ యాప్‌లో సెల్‌ఫోన్ వివరాలు నమోదు చేసి బ్లాక్ చేశారు. నూతన టెక్నాలజీ సాయంతో సెల్‌ఫోన్‌ను గుర్తించి ఎస్‌ఐ కనకయ్యగౌడ్ బాధితుడికి బుధవారం అందజేసినట్లు తెలిపారు.

సీఈఐఆర్‌తో ఫోన్ గుర్తింపు

వర్గల్(గజ్వేల్): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి బాధితుడికి అందజేశామని గౌరారం ఎస్‌ఐ తెలిపారు. ఆయన కథనం ప్రకారం గ్రామానికి చెందిన పాశం నరేందర్‌రెడ్డి తన ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. వెంటనే బాధితుడు తెలిపిన వివరాలను సీఈఐఆర్ టెక్నాలజీ యాప్‌లో నమోదు చేయించారు. యాప్ ద్వారా ఫోన్ ఆచూకీ గుర్తించి స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. ఫోన్ పోగొట్టుకుంటే సీఈఐఆర్ టెక్నాలజీలో నమోదుచేసుకోవాలని సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం: సీఐ లతీఫ్


తొగుట(దుబ్బాక): అవగాహన కలిగిస్తున్న సీఐ లతీఫ్

తొగుట(దుబ్బాక)/గజ్వేల్‌రూరల్/కొమురవెల్లి(సిద్దిపేట): విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని తొగుట సీఐ లతీఫ్ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలు, మత్తు పదార్థాలపై బుధవారం విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్‌లాంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందన్నారు. గ్రామాల్లో మత్తు పదార్థాలు విక్రయించినా, సేవించినా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సైబర్ నేరాలు జరిగినట్లు గుర్తిస్తే సైబర్ సెల్ హెల్ప్‌లైన్ 1930కు ఫోన్‌చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రవికాంతరావు, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. గజ్వేల్‌లోని జీఎంఆర్ జూనియర్ కళాశాలలో సీఐ సైదా విద్యార్థులకు గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ మోసాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అపరిచితుల మాటలు నమ్మి మోసపోవద్దని, సెల్‌ఫోన్‌లకు వచ్చే మెసేజ్‌లు, ఓటీపీలకు స్పందించవద్దని చెప్పారు. అదే విధంగా కొమురవెల్లిలో ఎస్‌ఐ రాజుగౌడ్ మాట్లాడుతూ గంజాయి కేసులో అరెస్టు చేసిన ఇద్దరు మైనర్‌లను సిద్దిపేటలోని డి–అడిక్షన్ సెంటర్‌కు తరలించామన్నారు.

ఘనంగా బీరప్ప బోనాలు


బోనాలతో తరలి వస్తున్న కురుమ, యాదవ కులస్తులు

మండల పరిధిలోని ఆకునూరులో కురుమ కులస్తుల కులదైవం బీరప్ప, యాదవుల దైవమైన చౌడలమ్మ దేవతల బోనాల పండుగను బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనాలెత్తుకొని ఊరేగింపుగా వచ్చి దేవతలకు సమర్పించారు. డప్పు చప్పుళ్లు, డోలు వాయిద్యాలు, శివసత్తుల పూనకాలు, ఒగ్గు కళాకారుల విన్యాసాలు, యువకుల నృత్యాల మధ్య ఊరేగింపు కొనసాగింది. తమ కోర్కెలు తీర్చాలని మొక్కులు సమర్పించుకున్నారు.

– చేర్యాల(సిద్దిపేట)

హెచ్‌ఐవీకి నివారణే మార్గం

గజ్వేల్‌రూరల్: హెచ్‌ఐవీకి మందు లేదు.. నివారణే మార్గమని పలువురు వక్తలు పేర్కొన్నారు. గజ్వేల్ బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ కో–ఎడ్యుకేషన్ డిగ్రీ కళాశాలలో బుధవారం భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్, స్పోర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్ డిగ్రీ కళాశాలలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్స్, ప్రోగ్రాం అధికారులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నిక్కత్ అంజుమ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ ఎక్కువగా యువతే హెచ్‌ఐవీ బారిన పడుతున్నారని పేర్కొన్నారు. అలాంటి వారికి ఉచితంగా మందులు, ఫించన్, రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల కు ఉపన్యాసం, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఐసీడీఎస్ అధికారి మల్లారెడ్డి, భవాని, కస్తూరి, జయరాజు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

'బాట ముచ్చట' పుస్తకావిష్కరణ


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

సిద్దిపేటకమాన్: సమకాలీన సామాజిక పరిస్థితులను విశ్లేషిస్తూ రచయిత మల్లారెడ్డి రచించిన 'బాల ముచ్చట' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని సిద్దిపేటలో శనివారం నిర్వహిస్తున్నట్టు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. దానికి సంబంధించిన కరపత్రాన్ని సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు రంగాచారి, తిరుపతిరెడ్డి, గ్యాదరి పరమేశ్వర్, విక్రమ్‌రెడ్డి మాట్లాడారు. రచయిత మల్లారెడ్డి తన జీవిత అనుభవాల్లోంచి, జరిగిన సంఘటనల్లోంచి సామాజిక మార్పు కోసం జరుగుతున్న పోరాటాలను విశ్లేషిస్తూ 'బాట ముచ్చట' రచించారని చెప్పారు. కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో సత్తయ్య, మధుసూదన్‌రెడ్డి, నారాయణరెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

కొండపాక(గజ్వేల్): సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరంలా మారిందని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లిలో బుధవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి పైరవీలు, ఆంక్షలు లేకుండా మంజూరవ్వడంతో పేదలు కార్పొరేట్ ఆసుపత్రులో మెరుగైన వైద్యం పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో బ్రహ్మం, నాగరాజు, చంద్రారెడ్డి, రవీందర్‌రెడ్డి, గడ్డె రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ టీపీటీఎఫ్ నూతన కార్యవర్గం

గజ్వేల్: టీపీటీఎఫ్ గజ్వేల్ మండలశాఖ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా తాళ్ల నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా విద్యాసాగర్ ఎంపికయ్యారు. జోన్ కన్వీనర్ సుంచు నరేందర్ పర్యవేక్షించగా టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రాంచంద్రం, రాష్ట్ర కౌన్సిలర్ రాజులు, గజ్వేల్ మండల మాజీ అధ్యక్షుడు పాపిరెడ్డి తదితరులు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

◆ నేడు ఏఎంసీ పాలకవర్గ ప్రమాణస్వీకారం

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం గురువారం నిర్వహించనున్నారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరువుతారని నూతన చైర్మన్ పులి కృష్ణ తెలిపారు. పార్టీ నాయకులు, రైతులు హాజరు కావాలని కోరారు.

◆ వీరన్నపేట కాంగ్రెస్ అధ్యక్షుడిగా శ్రీకాంత్

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ వీరన్నపేట అధ్యక్షుడిగా సూర్న శ్రీకాంత్‌ను నియమిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ప్రకటించారు. పార్టీ కోసం పనిచేసిన వారికి సరైన స్థానం లభిస్తుందని, సుమారు 15 యేండ్లుగా గ్రామస్థాయిలో పార్టీ అభివృద్ధికి శ్రీకాంత్ కృషిచేశారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, శ్రీనివాస్, నర్సింహులు, కరుణాకర్, విద్యాసాగర్, భాస్కర్, మురళి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

◆ ధూళిమిట్ట ఏఓగా అఫ్రోజ్

మద్దూరు(హుస్నాబాద్): ధూళిమిట్ట మండల వ్యవసాయశాఖ అధికారిగా అఫ్రోజ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో చేర్యాలలో విధులు నిర్వహించారు. ఉమ్మడి మద్దూరు ఏఓగా రామకృష్ణ ఇప్పటి వరకు బాధ్యతలు నిర్వహించారు.

◆ స్వయం ఉపాధితో ఆర్థికంగా రాణించాలి

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకొని ఆర్థికంగా రాణించాలని ఆర్థికశాస్త్ర అధ్యాపకులు కస్తూరిబాయి పేర్కొన్నారు. పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం కామర్స్ విభాగ అధిపతి డాక్టర్ బాలచంద్రన్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అనే అంశంపై విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కమలా క్రిస్టియాన, వైస్ ప్రిన్సిపాల్ శ్రీలత, అధ్యాపకులు జయరాజు, వీరయ్య, సరోజన, విద్యార్థినులు పాల్గొన్నారు.

◆ నేడు దూడల ఉత్పత్తి పథకంపై సదస్సు

గజ్వేల్‌రూరల్: దూడల ఉత్పత్తి పథకంపై ప్రభుత్వ పశువైద్యులు, గోపాలమిత్రలకు గురువారం ప్రాంతీయ పశు వైద్యశాలలో మధ్యాహ్నం 12గంటలకు ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి రాంజీ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు గజ్వేల్ పశువైద్య సహాయ సంచాలకుడు రమేశ్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పశువుల్లో ఆడ సంతతి కలగడానికి సెక్స్ సార్టెడ్ కృత్రిమ గర్భధారణ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, దానివల్ల రైతులకు లాభం చేకూరే అవకాశం ఉందని తెలిపారు.

◆ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో బుధవారం మురుగు కాలువలను పరిశీలించారు. నీరు నిల్వ ఉండకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. వర్షాకాలం ప్రారంభం కావడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని, ప్రజలు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. అనంతరం సిబ్బందికి పారిశుద్ధ్య నిర్వహణపై వివిధ సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శోభాయాత్ర

తొగుట(దుబ్బాక): మండల పరిధిలోని వెంకటరావుపేటలో కృష్ణాష్టమిని పురస్కరించుకుని వేణుగోపాల స్వామి దేవాలయంలో భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఘనంగా శోభా యాత్ర నిర్వహించారు. చిన్నారులు శ్రీ కృష్ణుడి వేషధారణలో ఉట్లను ఉత్సాహంగా కొట్టడంతో భక్తులు ఆసక్తిగా తిలకించారు.